సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 13 । నవంబర్ । 2024



నేడే తెప్పోత్సవాలు

అరసవల్లి, శ్రీకూర్మం, బలగ అయ్యప్ప స్వామి దేవాలయాల్లో నేడు తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఏర్పాట్లు పూర్తయ్యాయి.



న్యూస్‌రీల్

అన్నదాతకు అల్పపీడన గుబులు

వజ్రపుకొత్తూరు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రైతుల గుండెల్లో గుబులు రేకెత్తుతోంది. మబ్బులతో కూడిన చల్లని గాలులు వీయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వానలు పడితే పంట నష్టపోయే అవకాశం ఉందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. వజ్రపుకొత్తూరు చినకొత్తూరు, నగరంపల్లి, బెండి, గరుడఖండి, లక్ష్మీపురం, బెండి గేటు, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు, మందస, బ్రాహ్మణతర్లా తదితర గ్రామాల్లో రైతులు కోత పనుల్లోకి దిగారు.

ఉత్సాహంగా యువ ఉత్సవ్



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉత్సాహంగా యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ వేడుకలను ప్రారంభించారు. ముందుగా ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయం, జనపనార వస్తువుల తయారీ వంటి స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమాన్ని కేంద్ర యుజజన వ్యవహారాల శాఖ, నెహ్రూ యువకేంద్రం, వర్సిటీ నిర్వహించాయి. కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో వీసీ కేఆర్ రజిని, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎస్. నారాయణరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై హత్యాయత్నం



గాయపడిన ఆదినారాయణ

కవిటి: మండలంలోని పెద్దకర్రివానిపాలెంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులమైన తమపై టీడీపీకి చెందిన బైపల్లి కూర్మారావు తదితరులు హత్యాయత్నానికి పాల్పడ్డారని బాధితులు కోరాడ ఆదినారాయణ తెలిపారు. తన ఇంటిలో ఉండగా సోమవారం మూకుమ్మడిగా వచ్చి కోడ ఆదినారాయణ, మద్దు కృష్ణవేణి కుటుంబాలపై దాడికి దిగి కత్తులతో గాయపరిచారని కవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఇంటింటికీ తాగునీటి సరఫరాలో వేసిన కుళాయిలు విరగ్గొట్టిన వారిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నామని బైపల్లి కూర్మారావుతో పాటు మరో నలుగురు తమపై దాడికి దిగారని వారు పోలీసులకు తెలిపారు. ఈ గొడవ జరుగుతున్న సమయంలోనే పెద్దకర్రివానిపాలెం నుంచి జిల్లా కేంద్రంలోని 112 నంబర్‌కు ఫోన్ సమాచారం వెళ్లింది. ఇంతలో ఆ విషయం తెలుసుకున్న కవిటి పోలీసులు పెద్దకర్రివానిపాలెం బయల్దేరారు. పోలీసులు తమ దగ్గరికి వస్తున్నారన్న సమాచారంతో బైపల్లి కూర్మారావు మార్గమధ్యంలో పోలీసులను కలిసి తమపై దాడికి దిగారని కోరాడ ఆదినారాయణతో పాటు ముగ్గురు వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఊరికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదులు తీసుకుని సోమవారం రాత్రి కేసులు నమోదు చేశారు.

వెలుగుల రేడు.. బంగారపు తోడు

- ఆదిత్యునికి 17 కిలోల బంగారం, 531 కిలోల వెండి ఆభరణాలు



అరసవల్లి: ప్రత్యక్షదైవం శ్రీసూర్యనారాయణ స్వామి నేడు స్వర్ణాలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో కొలువు తీరిన ఆదిత్యుని మూలవిరాట్టుకు తొడిగిన బంగారు తొడుగుల వివరాలను పరిశీలిస్తే..

- మొత్తం 39 రకాల మూర్తుల కవచ ఆభరణాలతో పాటు స్వామి మూలవిరాట్టు చుట్టూ 3.361 కేజీల బంగారంతో మకరతోరణం ఉంది. రూ.1.56 కోట్లతో ఈ బంగారు మకర తోరణాన్ని భక్తులు విరాళాలతో చేయించారు.
- అధికారిక వివరాల మేరకు ఆలయానికి మొత్తం 17 కిలోల 213 గ్రాముల 248 మిల్లీ గ్రాముల బంగారం, 531 కేజీల 292 గ్రాముల 036 మిల్లీ గ్రాముల వెండి ఆభరణాలున్నట్లు రికార్డుల్లో నమోదయ్యాయి.

తెప్పోత్సవం ట్రయిల్‌రన్ సక్సెస్



పుష్కరిణిలో వాహనం ట్రయిల్ రన్

ప్రఖ్యాత అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో బుధవారం తెప్పోత్సవం జరగనుంది. కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా సాయంత్రం 4.15 గంటల నుంచి ఆలయ పుష్కరిణిలో క్రతువు నిర్వహించనున్నారు. స్వామి వారి ఉత్సవమూర్తులను హంసవాహనంలో ఉంచి పుష్కరిణిలో 12 సార్లు విహరించేందుకు వీలైన ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ముందుగా మంగళవారం ఉదయం వాహనం ట్రయల్ రన్‌ను నిర్వహించారు. ఫిట్‌నెస్ పరంగా అంతా సక్రమంగా ఉందని మత్స్యశాఖ అధికారులు ధ్రువీకరించడంతో పాటు గరిష్ఠంగా 28 లేదా 30 మంది వరకు మాత్రమే వాహనంలో ఉండేందుకు అనుమతినిస్తున్నట్లుగా ప్రకటించారు. అలాగే స్వామి బుధవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు గర్భాలయంలో స్వర్ణాలంకరణలో దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం మంగళవారం మధ్యాహ్నం నగరంలోని ప్రధాన బ్యాంకులు, ట్రెజరీల నుంచి బంగారు ఆభరణాలను గట్టి బందోబస్తు నడుమ ఆలయానికి తీసుకువచ్చి..అలంకరణకు సిద్ధం చేశారు. ఆలయంలో విశిష్ట పర్వదినాల్లో స్వామిని స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చేలా ఆలయ అధికారులు చర్యలు చేపడుతున్న క్రమంలో తెప్పోత్సవం నాడు కూడా స్వర్ణాలంకరణలో ఆదిత్యుని దర్శనం కలుగనుంది.

స్వర్ణ కాంతుల మకరతోరణం



మధ్యలో కీర్తిముఖం,	ఇరువైపులా చిలుకల తోరణాలు,	ఇరువైపులా మకర పక్షులు,
ఇరువైపులా మూలస్తంభాలు	చెరోవైపున జయవిజయుల మూర్తులు	

స్వర్ణాభరణాలివే...

ఛత్రం, కీర్తి ముఖం , కిరీటం
ఇరువైపుల కేయూరాలు
సనక మహర్షి కవచం
(ఎడమ వైపున)
సనంద మహర్షి కవచం
(కుడి వైపున)
రెండు నేత్రాలు
బొట్టు, మీసాలు
ఇరువైపుల కర్ణపత్రాలు
ఇరువైపులా తామర పద్మాలు,
రెండేసి తామర మొగ్గలు
కవచం, ఇరువైపుల హస్తాలు



సువర్ణ ఆభరణం
(అలంకరణ కోసం)
ఇరువైపుల వాణీ చెంగులు
పింగళుడి కవచం
(ఎడమ వైపు ద్వారపాలకుడు)
మాఠల కవచం
(కుడివైపు ద్వారపాలకుడు)
రెండు పాదాలు
ఛాయా దేవి (పాదాల క్రింద)
పద్మినీ దేవి కవచం
(ఎడమ వైపు)
ఉషా దేవి కవచం (కుడి వైపు)
అనూరుడు (రథసారధి)
ఏడు గుర్రాలు (సప్తాశ్వాలు)

కూనకు మళ్లీ నిరాశ

- విప్ పదవి సైతం దక్కని పరిస్థితి
- వరుసగా చేజారిపోయిన పదవులు
- బెందాళం అశోక్‌కు విప్ పదవి కేటాయింపు
- అదృశ్య శక్తులుగా గండికొడుతున్నది కింజరాపు ఫ్యామిలీయేనని అనుమానం!



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మరోసారి పార్టీ అధిష్ఠానం మొండి చేయి చూపింది. చివరికి విప్ పదవి కూడా ఇవ్వలేదు. తాజాగా 16 మందిని విప్‌లుగా ప్రకటించగా అందులో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు చోటు దక్కింది. ఈ తాజా పరిణామంతో కూన రవికుమార్ ఆశలు క్రమేపీ గల్లంతవుతున్నాయి. ఆయన్ని రెండు అదృశ్యశక్తులు తొక్కేస్తున్నాయి. ఆ అదృశ్య శక్తులు కింజరాపు ఫ్యామిలీకి చెందిన మంత్రులే అయి ఉండొచ్చని ప్రచారం కూడా జరిగిపోతోంది. పరిస్థితి చూస్తుంటే కూనకు ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే పదవి తప్ప మరొకటి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకో అధిష్ఠానం కూడా నిరాదరణకు గురి చేస్తోంది.

పార్టీ ప్రతిపక్షంలో ఉండగా జిల్లా అధ్యక్షుడిగా కూన రవికుమార్ కష్టపడి పనిచేశారు. పార్టీ విజయంలో తన వంతు పాత్ర పోషించారు. వివాదాస్పద నేతగా రాజకీయాలు చేసినప్పటికీ పార్టీకి మాత్రం ప్లస్ అయింది. దీంతో అధికారంలోకి వచ్చాక తప్పనిసరిగా మంత్రి పదవి వస్తుందని భావించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కేబినెట్ కూర్పులో తప్పకుండా కూన రవికుమార్ పేరు ఉంటుందని అనుకున్నారు. ప్రమాణ స్వీకారం చేయడమే మిగిలి ఉందని అంతా ఊహించారు. కానీ జాబితాలో పేరు లేదు. దీంతో ఒక్కసారి కూన శిబిరం నిరాశతో పాటు ఆవేదనకు గురైంది. కేబినెట్‌లో బెర్త్ తప్పినా ఆ స్థాయి పదవి మరొకటి వస్తుందని ఆశతో ఎదురు చూస్తూనే ఉన్నారు.

ఒక్కొక్కటీ చేజారిపోతున్నాయి..

మొన్నటికి మొన్న టీటీడీ బోర్డులో చోటు దక్కుతుందని భావించారు. అందులో కూడా నిరాశే ఎదురైంది. చివరికి విప్ పదవైనా వస్తుందని ఆశపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 16మందిని ప్రకటించగా అందులో జిల్లాకు చెందిన బెందాళం అశోక్‌కు చోటు దక్కిందే తప్ప కూన రవికుమార్‌కు స్థానం కల్పించలేదు. దీంతో గతంలో నిర్వహించిన విప్ సైతం ఆయనకు దూరమైంది. ఇక, చెప్పుకోదగ్గ పదవులు మరేవీ లేవు. కీలకమైన నామినేటెడ్ పదవులు కూడా భర్తీ అయిపోయాయి. ఇప్పటికైతే కూనకు ఇంతే. ఇవ్వడానికి కూడా సరైన పదవుల్లేవు. దీంతో కూనకు ఎమ్మెల్యే పదవి తప్ప మరొకటి వచ్చే దారులు కనిపించడం లేదు.

తొక్కేస్తున్నది కింజరాపు ఫ్యామిలీయేనా!

కూన రవికుమార్‌కు ప్రభుత్వంలో ప్రమోషన్ దక్కకుండా, కీలక పదవులు రాకుండా చేస్తున్నది కింజరాపు ఫ్యామీలికి చెందిన ఇద్దరు మంత్రులేనా ? అన్న ప్రచారం గట్టిగా జరుగుతోంది. అధిష్ఠానం వద్ద ఉన్న పలుకుబడితో కూన రవికి ఉన్నత పదవులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారనే వాదన నడుస్తోంది. జిల్లాలో తమదే ఏకఛత్రాధిపత్యం కొనసాగాలని, మరొకరికి పదవి ఇస్తే మరో పవర్ సెంటర్ తయారవుతుందని, ముఖ్యంగా కూన రవికుమార్‌కు ఇస్తే తమ పట్టు సడలుతుందనే అభిప్రాయంతో వ్యూహాత్మకంగా కుట్రలు పన్నుతున్నట్టు స్పష్టమవుతోంది. ఈ విషయమై బహిరంగంగా ఓపెన్ కాకపోయినప్పటికీ తన అనుయాయుల వద్ద కూన రవికుమార్ కూడా చెబుతున్నట్టుగా సమాచారం. పదవులు రాకుండా అడ్డుకుంటున్నదే వారేనని చెప్పకనే చెబుతున్నారు. ఆ అనుమానంతో తన వర్గీయులెవ్వరూ కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు వద్దకు వెళ్లవద్దని, పనుల కోసం కలవవద్దని చెబుతున్నట్టుగా తెలిసింది. మొత్తానికి తన రాజకీయ ఎదుగుదలకు కింజరాపు ఫ్యామిలీ బ్రేక్ వేస్తున్నట్టుగా స్పష్టంగా తెలుస్తోంది.

పట్టుబడిన ఒడిశా గంజాయి బ్యాచ్

- బొలేరో డ్రైవర్, యజమాని, హోంగార్డు అరెస్టు
- 16 బస్తాల్లో 563.9 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి నిందితులతో ఎస్పీ, పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: బొలేరోలో భారీగా గంజాయి అక్రమ రవాణా.. వాహనంలో ఉన్న ముగ్గురిదీ ఒడిశానే.. అక్కడి నుంచి మెళియాపుట్టి మీదుగా పలాస హైవే చేరుకుని అక్కడి నుంచి తమిళనాడుకు చేరుకోవడమే వీరి ప్లాన్. గతంలో ఎన్నోసార్లు ఇలా పథక రచన విజయవంతంగా అమలు చేశారు. ఈసారి పోలీసుల కంట పడ్డారు. ఆ సమయంలో తప్పించుకునే క్రమంలో మరో నేరం చేయడంతో పదిరోజులు ఆలస్యమైనా జిల్లా పోలీసులకు పట్టుబడ్డారు. గత నెల 24న మెళియాపుట్టి మండలం తూముకొండ ఆకులమ్మ ఆలయం వద్ద ద్విచక్రవాహనాన్ని అక్ర మ గంజాయి తరలిస్తున్న బొలేరోతో ఢీకొని వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యారు. పోలీసులు సాంకేతికత సాయంతో వారిని గుర్తించగా ఒడిశా గంజాయి బ్యాచ్‌గా తేలింది. వీరిని మంగళవారం అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో ఒడిశాకు చెందిన హోంగార్డు కూడా ఉన్నారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళ వారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

ఒకరికొకరు సాయంగా..

ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా పుట్టసింగి పీఎస్ పరిధి పెండగుడి గ్రామానికి చెందిన ఆయుబ్ మాఝి(35) గంజాయి సాగు చేసేవాడు. అదే రాష్ట్రం గజపతి జిల్లా శాంతినగర్‌కు చెందిన రంజిత్ భర్దన్ (31) గంజాయి ఎక్కడ ఉన్నా సమకూర్చేవాడు. వీరిద్దరికీ అదే రాష్ట్రం గజపతి జిల్లా ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు అభి మాఝి తోడై తమిళనాడు, ఇతర ప్రాంతాలకు తరలించడంలో సహకారమందించేవాడు.

ప్రమాదం జరగడంతో..

గత నెల 24న ఒడిశా గజపతి జిల్లా నుంచి అడవా ప్రాంతం ఉటుక గ్రామం నుంచి నుంచి తమిళనాడుకు 16 బస్తాల్లో 563.9 కిలోల గంజాయిని తరలించే క్రమంలో మెళియాపుట్టి వద్ద పోలీసులను చూసి అధిక స్పీడుతో బండిని నడిపారు. జాడుపల్లి దాటి తూముకొండ ఆకులమ్మ ఆలయం దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోవడం.. గ్రామస్తులు, పోలీసులు వెంబడించడం.. తిరిగి జాడుపల్లి వద్దకే బండిని తెచ్చి వదిలేసి అందులో ఉన్న ముగ్గురూ పరారయ్యారు. బొలేరాలో ఉన్న గంజాయిని గుర్తించిన పోలీసులు ఆ రోజే వాహనాన్ని సీజ్ చేశారు. అదనపు ఎస్పీ (క్రైమ్) పాత్రిని శ్రీనివాసరావు పర్యవేక్షణలోని రెండు ప్రత్యేక బృందాలు సాంకేతికత ఆధారంగా ముందుగా ఆయుబ్ మాఝీని గుర్తించి అనంతరం రంజిత్ బర్దన్‌ను, సహకరించిన హోంగార్డు అభి మాఝిని గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. గంజాయి విక్రయంతో సమకూర్చుకున్న ఆస్తులను జప్తు చేస్తామని చెప్పారు. కేసును ఛేదించిన అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాసరావు, పాతపట్నం సీఐ వి.రామారావు, మెళియాపుట్టి ఎస్‌ఐ పి.రమేష్‌బాబు, కానిస్టేబుళ్లు జగన్నాథం, గౌరీశంకర్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

గంజాయి కట్టడికి కెనైన్ డాగ్స్

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి అక్రమ రవాణాపై మరింత నిఘా పెట్టనున్నామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరారైన 56 మంది గంజాయి నిందితుల్లో ఏడుగురిని ఇప్పటికే పట్టుకున్నామని, నగరానికి చెందిన మరో ముగ్గురిని గుర్తించామన్నారు. మిగతా వారంతా ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన నిందితులేనని వెల్లడించారు. బస్సులు, రైళ్లు, కార్లే కాకుండా తనిఖీ చేసేవారమని ఇకపై కంటైనర్లు, ట్రక్కులు (బొలేరా)పైనా నిఘా పెడతామన్నారు. గంజాయి ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే డ్రోన్ సర్వే చేపట్టామని, గంజాయి వాసనను గుర్తించే కెనైన్ డాగ్‌ను తీసుకెళ్లి పరిశీలిస్తున్నామని చెప్పారు.







వన్యప్రాణుల అక్రమ రవాణా

జంతువులను అక్రమంగా తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను కాశీబుగ్గ అటవీశాఖాధికారులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి ఓ కారులో జంతువులను తరలిస్తుండగా ఇచ్ఛాపురం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. కారులో పైథాన్లు, నక్షత్ర తాబేళ్లు, అడవి పిల్లి ఉన్నాయి. – కాశీబుగ్గ

దాతల స్పందనే.. పాపకు దీవెన

- తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికకు పెద్ద కష్టం
- చచ్చుబడిన కాళ్లు, చేతులు
- దాతల సాయం కోసం ఎదురు చూపులు



కటక్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

ఇచ్ఛాపురం రూరల్: నిన్న మొన్నటి వరకు ఆ ఇంటి నలు చెరుగులా వినిపించిన పట్టీల చప్పుడు ఇప్పుడు మూగబోయింది. ఆ అమ్మాయి చేతిలో సందడిగా మోగిన గాజులు ఇప్పుడు నిశ్శబ్దమైపోయాయి. చెంగుచెంగున ఎగురుతూ ఆనందంగా కనిపించిన అమ్మాయి కదల్లేక మంచానికి పరిమితమైపోయింది. కళ్ల ముందే కన్నకూతురు చలనం లేకుండా పడి ఉండడం చూసి తల్లిదండ్రుల గుండె ముక్కలైంది. కన్నబిడ్డకు వచ్చిన కష్టాన్ని చూసి తట్టుకోలేక, చికిత్స చేయించేందుకు ఆర్థిక స్థోమత సరిపోక ఆ దంపతులు సాయం కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే..

డొంకూరు గ్రామానికి చెందిన దున్న మోహనరావు, తరిణమ్మల కుమార్తె దున్న సమీర స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అటు ఆటల్లో, ఇటు చదువులో ముందుండే సమీర రెండు నెలల కిందట అనారోగ్యానికి గురైంది. వైద్యులకు చూపిస్తే త్వరలో కోలుకుంటుంది అన్నారు. ఇంటి వద్దనే చికిత్స పొందిన సమీరాకు అకస్మాత్తుగా రెండు కాళ్లు, రెండు చేతులు చచ్చుబడిపోయాయి. దీంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి పలు ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల చుట్టూ తిప్పారు. చివరికి ఒడిశా రాష్ట్రం కటక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పక్షవాతంతో చికిత్స పొందుతోంది. అగ్నికి వాయువు తోడైనట్లు సమీరా వెన్నెముకలో రాచపుండు తయారవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చికిత్స చేయించేందుకు తమ ఆర్థిక స్థోమత సరిపోవడం లేదని, దాతలు సాయం చేస్తూ తమ బిడ్డ మళ్లీ లేచి తిరుగుతుందని ఆశ పడుతున్నారు. దాతలు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

సాయం చేయాలనుకునేవారు 6302970633 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.